క్లుప్తంగా

డీవీజీకి సన్మానం



డాక్టర్ డీవీజీ శంకర్రావును సన్మానిస్తున్న రెడ్డి సురేష్, మత్స భాస్కరరావు తదితరులు

సాలూరు రూరల్: ఎస్టీ కమిషన్ చైర్మన్ డాక్టర్ డీవీజీ శంకర్రావు పదవీ కాలం ఆదివారంతో ముగుస్తున్న సందర్భంగా మండలంలోని బాగువలస గ్రామానికి విచ్చేసిన ఆయనను గ్రామపెద్దలు మత్స భాస్కరరావు, వైస్ ఎంపీపీ రెడ్డి సురేష్, దాలినాయుడు, గేదెల మోహన రావులు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా భాస్కరరావు, సురేష్‌లు మాట్లాడుతూ డీవీజీ శంకర్రావుకు ఇచ్చిన పదవిని సద్వినియోగం చేసుకుని సమాజానికి అందించిన సేవలు మరువలేనివన్నారు. అలాగే శంకర్రావు మాట్లాడుతూ ఇంత బాధ్యతాయుతమైన పదవిని ఇచ్చిన నాటి ముఖ్యమంత్రి జగన్‌మోహన రెడ్డికి పదవిలో కొనసాగించిన నేటి ముఖ్యమంత్రి చంద్రబాబుదనాయుడికి కృతజ్ఞతలు తెలిపారు.

పారిశుధ్య పనులు వేగవంతం చేయాలి



మరిపివలసలో జరుగుతున్న పారిశుధ్య పనులు

సీతానగరం: మండలంలోని గ్రామాల్లో పారిశుధ్య పనులు వేగవంతం చేయాలని డిప్యూటీ ఎంపీడీఓ కె.కుమారవర్మ అన్నారు. ఈ మేరకు సూరంపేట పంచాయితీ గ్రామాల్లో జరుగుతున్న పూడిక తీత కార్యక్రమంతో పాటు పారిశుధ్య పనులను ఆదివారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గ్రామాల్లో పారిశుధ్య పనులు జరుగుతున్నాయని ఈ పనులు పూర్తి చేయాలని, బహిరంగ మలవిసర్జనకు స్వస్తి పలికి ఇంటి ఇళ్లలో నిర్మించుకున్న వ్యక్తిగత మరుగుదోడ్లను వినియోగించుకోవాలన్నారు. తద్వారా వ్యాధుల నివారణకు సహకరించాలని కోరారు. ఇప్పటికీ బహిరంగ మల విసర్జన జరుగుతున్న గ్రామాల్లో పంచాయతీ కార్యదర్శుల ద్వారా అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

పనసలపాడులో వేంకటేశ్వర వ్రతాలు



పనసలపాడులో నిర్వహిస్తున్న సామూహిక వేంకటేశ్వర వ్రతాలు

సాలూరు: పాచిపెంట మండలంలోని పి.కోనవలస పంచాయతీ పనసలపాడు గిరిజన గ్రామంలో ఆదివారం సామూహిక వేంకటేశ్వర వ్రతాలు నిర్వహించారు. సనాతన ధర్మపరిషత్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో వేంకటేశ్వర స్వామి మహత్యాన్ని వివరిస్తూ, వ్రతం చేశారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని స్వామివారిని పూజించారు. దీంతో స్థానికంగా ఆధ్యాత్మికతతో కూడిన సందడి వాతావరణం నెలకొంది.

మాస్టారు కుటుంబాన్ని పరామర్శించిన డీవీజీ



బాలకృష్ణ మాస్టారు కుటుంబసభ్యులను పరామర్శిస్తున్న ఎస్టీ కమిషన్ చైర్మన్ డీవీజీ శంకర్రావు

సాలూరు రూరల్: ఇటీవల మృతి చెందిన ఉపాధ్యాయుడు కోట బాలకృష్ణ కుటుంబసభ్యులను ఎస్టీ కమిషన్ రాష్ట్ర చైర్మన్ డాక్టర్ డీవీజీ శంకరరావు ఆదివారం పరామర్శించారు. మండలంలోని పెదపధం ప్రాథమిక పాఠశాలలో పనిచేస్తున్న ఉపాధ్యాయుడు కోట బాలకృష్ణ ఇటీవల మృతి చెందారు. ఈ విషయం తెలుసుకున్న డాక్టర్ డీవీజీ శంకర్రావు ఆదివారం ఆయన స్వగ్రామం పాలికవలస వెళ్లి కుటుంబ సభ్యులను ఓదార్చి ప్రగాఢ సానుభూతి తెలియజేశారు.

హోటల్‌లో మర్చిపోయిన బ్యాగు మాయం

పార్వతీపురం రూరల్: రాయగడకు చెందిన సైలాడ వరలక్ష్మి కుటుంబ సభ్యులు ఆదివారం ఉదయం పార్వతీపురం లోని బైపాస్ రోడ్‌లో ఉన్న హోటల్‌లో టిఫిన్ నిమిత్తం వెళ్లి, తిరిగి వెళ్లే క్రమంలో తమ బ్యాగును హోటల్‌లోనే మర్చిపోయారు. కొంత ప్రయాణం అనంతరం తిరిగి హోటల్‌కు వెళ్లి చూడగా బ్యాగు అపహరణకు గురవడంతో పార్వతీపురం పట్టణ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పట్టణ ఎస్సై జగదీష్ నాయుడు తెలిపారు. అపహరణకు గురైన బ్యాగులో రూ.95 వేల నగదు ఉన్నట్లు బాధితులు వెల్లడించినట్లు ఎస్సై చెప్పారు.



అప్పుడు వంతెన.. ఇప్పుడు రోడ్డు..
వారే సొంతంగా నిర్మించుకున్నారు!

ఎవరో వస్తారు.. ఏదో చూస్తారని వారెదురు చూడలేదు. మొదట తమ కష్టాలను ప్రజాప్రతినిధులు, అధికారులకు చెప్పుకున్నారని, అయినా ఫలితం లేకపోవడంతో వారే ముందడుగు వేసి, స్వయంగా వంతెన..రోడ్డు.. నిర్మించుకున్నారు. ఇదంతా ఎవరి కథ అనుకున్నారా..కురుపాం మండలం, గొటివాడ పంచాయతీ, బోరి గ్రామస్తులది. గొటివాడ నుంచి బోరి గ్రామం మధ్య సరైన రోడ్డు సదుపాయం లేకపోవడంతో పాటు ఆయా ప్రాంతాల మధ్య ఉండే గెడ్డపై కూడా వంతెన సౌకర్యం లేదు. దీంతో గ్రామస్తులు వారి గ్రామం నుంచి వేరే ప్రాంతానికి రాకపోకలు సాగించేందుకు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ఈ క్రమంలో ఎంతోమంది నాయకులు, అధికారులను కలిసి తమ గోడు వినిపించారు. అయినా ఫలితం లేకపోవడంతో గ్రామ ప్రజలంతా కలిసి ఏడాది క్రితం గెడ్డపై కర్రల సాయంతో తాత్కాలికంగా వంతెన ఏర్పాటు చేసుకున్నారు.

ఇప్పుడు చందాలు వేసుకుని మరీ ద్విచక్ర వాహనాలు వెళ్లేందుకు వీలుగా సీసీ రోడ్డు నిర్మించుకున్నారు. ఏ చిన్నపాటి వర్షం కురిసిన వరదనీటితో గెడ్డ పొంగేదని, రోడ్డు కూడా బురదమయమై రాకపోకలకు ఇబ్బంది అయ్యేదని తెలిపారు. ప్రస్తుతం వానాకాలంలోనూ రాకపోకలకు అంతరాయం కలగకుండా తాత్కాలిక వంతెన, రోడ్డుల నిర్మాణం చేసుకున్న ఆ గ్రామస్తులను చుట్టుపక్కల గ్రామాల ప్రజలు అభినందిస్తున్నారు.



-గుమ్మలక్ష్మీపురం(కురుపాం)

గలావల్లిలో యూరియా కొరత



గలావల్లిలో రైతు సేవా కేంద్రం వద్ద రైతుల అవస్థలు

బలిజిపేట: అరకొర యూరియా సరఫరాతో రైతులు అవస్థలు పడుతున్నారు. రైతు సేవా కేంద్రాలకు అవసరం మేరకు యూరియా రాకపోవడంతో రైతులు వెంపర్లాడుతున్నారు. గలావల్లి రైతు సేవా కేంద్రానికి వచ్చిన బస్తాల కంటే రైతులు ఎక్కువ సంఖ్యలో ఉండడంతో పొలం పనులు మానుకుని రైతు సేవా కేంద్రం వద్ద నిరీక్షించాల్సి వస్తోందని వాపోతున్నారు. ఎన్ని ఎకరాలు ఉన్నా ఒక్క యూరియా బస్తా మాత్రమే ఇస్తున్నారని ఇలా అయితే రైతులకు అవసరమైన ఎరువులు ఎలా అందించగలరని ప్రశ్నిస్తున్నారు. ప్రైవేట్ మార్కెట్‌లో యూరియా అందుబాటులో ఉన్నప్పటికీ రేటు ఎక్కువగా ఉండడంతో కొనలేకపోతున్నామని మండలంలోని రైతులు చెబుతున్నారు. దీనిని నియంత్రించి గత ప్రభుత్వం మాదిరిగా రైతులకు అవసరం మేరకు ఎరువులు అందించాలని కోరుతున్నారు.

శివారు భూములకు సాగునీరు



సాగునీటిని విడుదల చేసి మాట్లాడుతున్న ఎమ్మెల్యే విజయచంద్ర

సీతానగరం: సువర్ణ ముఖినదిపై కొత్తవలస వద్ద ఉన్న సాగునీటి ప్రాజెక్టు ద్వారా నిర్దేశించిన చివరి భూములకు సాగునీరు అందిస్తామని ఎమ్మెల్యే బోనెల విజయచంద్ర అన్నారు. ఈ మేరకు మండలంలోని కొత్తవలస డ్యాం వద్ద ఆదివారం ఆయకట్టు దారుల సంఘం చైర్మన్ టి. వెంకటప్పలనాయుడు ఆధ్వర్యంలో సాగునీరు విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రాజెక్టు పరిధిలోని నిర్దేశించిన భూములకు ఖరీఫ్ సీజన్‌లో పూర్తిస్థాయిలో సాగునీరందిస్తామన్నారు. రూ.32 కోట్ల వ్యయంతో 6500 ఎకరాలకు సాగునీరు అందించడానికి ప్రధాన కాలువలు, బ్రాంచ్ కాలువలపై ఉన్న కల్వర్టులు, స్లూయిస్‌లు, చప్టాల నిర్మాణానికి చర్యలు తీసుకుంటున్నామన్నారు. వచ్చే ఖరీఫ్ సీజన్ నాటికి పనులు పూర్తి చేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో వైఎస్ చైర్మన్ ఎస్.రమేష్, ఆయా గ్రామాల సర్పంచ్‌లు, టీడీపీ మండల అధ్యక్ష, కార్యదర్శులు పెంట సత్యంనాయుడు, ఆర్.వేణు, ఇరిగేషన్ డీఈ నారాయణరావు, ఏఈ సోమేశ్వరరావు అధికారులు పాల్గొన్నారు.

ఇనుప ఫుల్‌వీల్స్ ట్రాక్టర్లు నడిపితే చర్యలు



వాహనదారులకు అవగాహన కల్పిస్తున్న ఎస్సై వెంకటరమణ

మక్కువ: ఇనుప ఫుల్‌వీల్స్ అమర్చిన ట్రాక్టర్లు రహదారులపై వాహన యజమానులు నడిపితే చర్యలు తీసుకుంటామని ఎస్సై వెంకటరమణ వాహనదారులను ఆదివారం హెచ్చరించారు. ఈ మేరకు మక్కువ, దుగ్గేరు రహదారిలో వాహనదారులకు అవగాహన కల్పించారు. ఖరీఫ్ సీజన్ కావడంతో రైతుల పంటపొలాల్లో దమ్ములు జరపనున్న నేపథ్యంలో ఇనుప ఫుల్‌వీల్స్ కల్గిన ట్రాక్టర్లను రహదారులపై నుంచి పంట పొలాలకు తరలిస్తున్నట్లు ఫిర్యాదులందు తున్నాయన్నారు. ఇనుప ఫుల్‌వీల్స్‌తో ట్రాక్టర్లు రహదారులపై నడపడం వల్ల రహదారులు పాడవుతున్నాయని, అందువల్ల వాహనదారులు ట్రాక్టర్లు నడపరాదన్నారు. నడిపినట్లు కనిపించినా, ఫిర్యాదులందినా చర్యలు తప్పవని ఎస్సై వెంకటరమణ హెచ్చరించారు.

పర్యవేక్షణ అవసరం

పాలకొండ రూరల్: పట్టణంలో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాల పనితీరుపై దృష్టి సారించాలని ఎస్సై ప్రయోగమూర్తి సిబ్బందికి సూచించారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ.. దాదాపు 80 కూడళ్ల వద్ద ఈ కెమెరాలు ఏర్పాటు చేయడంతో పట్టణ పరిధిలో పర్యవేక్షణ సులభతరమైందన్నారు. పట్టణ ప్రధాన మార్కెట్‌లో ఏర్పాటు చేసిన కెమెరాల పనితీరును ఆయన పరిశీలించారు.

కోటదుర్గమ్మ ఆలయానికి పోటెత్తిన భక్తులు

పాలకొండ రూరల్: శ్రావణమాసాన్ని పురస్కరించుకుని ఉత్తరాంధ్రుల ఆరాధ్య దైవం కోటదుర్గమ్మ దేవస్థానానికి భక్తులు పోటెత్తారు. ఆదివారం పెద్ద ఎత్తున సంబరాలు నిర్వహించారు. ప్రధానార్చకులు లక్ష్మీప్రసాద్‌శర్మ, మణీల్‌కుమార్ శర్మ భక్తుల గోత్రనామాలతో పూజలు జరిపించారు. స్థానిక అభయాంజనేయ ఆలయంలో అన్నదానం చేపట్టారు.

జలగణన వేగవంతానికి సహకరించాలి



బుడ్డిపేట పంప్ సెట్ వద్ద అప్‌లోడ్ చేయడంపై శిక్షణ ఇస్తున్న ఏఎస్‌ఓ సతీష్‌కుమార్

సీతానగరం: మండలంలోని చిన్నతరహా నీటి వనరుల గణన, రెండవ జలాశయాల గణన చేస్తున్న సమయంలో ప్రజలు సహకరించాలని మండల సహాయ గణాంక అధికారి సతీష్‌కుమార్ అన్నారు. ప్రభుత్వాదేశాల మేరకు జరుగుతున్న జలగణన కార్యక్రమంలో భాగంగా ఆదివారం లక్ష్మీపురం, బుడ్డిపేట గ్రామాల్లో వీఆర్వోలు, రైతులతో కలిసి సాగునీటి వనరులను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ తహసీల్దార్ పర్యవేక్షణలో మండలంలోని చెరువులు, బావులు, జలాశయాలు, బోర్లు, గొట్టపు బావుల సెన్సస్ యాప్‌లో వీఆర్వోలు తప్పనిసరిగా నమోదు చేయాలని సూచించారు. వీఆర్వోలు, శిక్షణ పొందిన సిబ్బంది సహకారంతో క్షేత్రస్థాయిలో 7వ చిన్న నీటి జలాశయాలు, నీటి వనరుల గణన మొబైల్ యాప్‌లో అప్‌లోడ్ చేయనున్నామన్నారు. నిర్దేశించిన గడువులోగా సర్వే పూర్తి చేయడానికి గ్రామాలకు వస్తున్న అధికారులకు ప్రజలు సహకరించాలని కోరారు. కార్యక్రమంలో లక్ష్మీపురం, బుడ్డిపేట, బూర్జ వీఆర్వోలు అనందరావు, ఎం సింహాచలం, జాగాన దామోదర నాయుడు ఆయాగ్రామాల రైతులు పాల్గొన్నారు.

ఘనంగా రంగునాయుడి జన్మదినోత్సవం

- వృద్ధులు, చిన్నారులకు వస్త్రాల పంపిణీ



రంగునాయుడికి కేక్ తినిపిస్తున్న మాజీ డిప్యూటీ సీఎం పీడిక రాజన్నదొర

మక్కువ: వైఎస్సార్‌సీపీ మక్కువ మండలాధ్యక్షుడు మావుడి రంగునాయుడు పుట్టినరోజు వేడుకలు ఆదివారం స్థానిక పద్మశ్రీ థియేటర్ వద్ద అభిమానులు, పార్టీనాయకులు, కార్యకర్తలు నడుమ ఘనంగా నిర్వహించారు. మాజీ డిప్యూటీ సీఎం పీడిక రాజన్నదొర, జెడ్పీటీసీ మావుడి శ్రీనివాసరావు, ఎంపీపీ మర్రిపారమ్మ, వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యదర్శి దండి శ్రీను, సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, మక్కువ, సాలూరు, పాచిపెంట, మెంటాడ మండలాలకు చెందిన పలువురు వైఎస్సార్‌సీపీనాయుకులు మక్కువ చేరుకుని రంగునాయుడికి పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపారు. రంగునాయుడు జన్మదినం సందర్భంగా స్థానిక వస్త్రదాన కమిటీ సభ్యులు, మక్కువ కూరాకులవీధికి చెందిన అభిమాని కృష్ణవేణి వృద్ధులకు చీరలు, చిన్నారులకు దుప్పట్లు పంపిణీ చేశారు. ఎంఆర్ఎస్ యూత్ అధ్యక్షుడు బురిడి చిన్నారావు ఆధ్వర్యంలో 1000 మందికి అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. బీసీకాలనీ, హోలీక్రాస్ పాఠశాల, రామిరెడ్డివీధి, హరిజనవీధి, తదితర వీధుల్లో రంగునాయుడు అభిమానులు కేక్‌కట్‌చేసి సంబరాలు చేసుకున్నారు.

నవజీవన్ ఆశ్రమంలో జన్మదినోత్సవం

సాలూరు: వైఎస్సార్‌సీపీ మక్కువ మండలాధ్యక్షుడు మావుడి రంగునాయుడి జన్మదినోత్సవం సాలూరు పట్టణంలోని నవజీవన్ ఆశ్రమంలో ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆశ్రమంలోని చిన్నారులకు భోజనంతో పాటు సబ్బులు, పేస్టులు తదితర సామగ్రిని మావుడి రంగునాయుడు అందించారు. ఈ మేరకు రంగునాయుడికి ఆశ్రమ నిర్వాహకులు, చిన్నారులు, స్థానిక వైఎస్సార్‌సీపీ నాయకులు శుభాకాంక్షలు తెలిపారు.

నిరుపయోగంగా సంపద సృష్టి కేంద్రాలు



నిరుపయోగంగా ఉన్న కురుకుట్టిలోని చెత్త సంపద కేంద్రం



పిచ్చి మొక్కలతో నిండిన నాడెప్‌లు

సాలూరు రూరల్: కూటమి ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకున్న చెత్త నుంచి సంపద సృష్టి కేంద్రాలు ప్రభుత్వ వైఫల్యమో లేక అధికారులు నిర్లక్ష్యమో కాని నిరుపయోగంగా పడి ఉన్నాయి. గ్రామంలోని చెత్త సేకరించి నాడెప్‌లో వేసి అందులో నుంచి వ్యవసాయ భూముల్లో వినియోగించే ఎరువును తయారు చేయాల్సి ఉంది. అయితే మండలంలో ఉన్న ఈ కేంద్రాలకు కూటమి ప్రభుత్వం ఏర్పాటైన తొలి రోజుల్లో ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు సున్నాలు వేసి వాటిని వినియోగంలోకి తెచ్చేస్తున్నామని ప్రచారం చేసుకున్నారు. అయితే ఈ కేంద్రాలు మాత్రం అధికారుల నిర్లక్ష్యానికి సాక్ష్యాలుగా నిలుస్తున్నాయన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. కూటమి ప్రభుత్వం ఏ కార్యక్రమాన్ని ప్రారంభించినా ఆరంభశూర్వత్వం అన్నట్లు ప్రారంభించడం ఆ పనులు ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా ఉంటున్నాయని ప్రజల్లో చర్చగా మారింది.

పోరాటాలకు సిద్ధం కావాలి



సమావేశంలో మాట్లాడుతున్న సీఐటీయూ నాయకులు

పార్వతీపురం: మున్సిపల్ కార్మికుల సమస్యలపై ఐక్య పోరాటానికి సిద్ధం కావాలని సీఐటీయూ నాయకులు వై.మన్మథరావు, డి.రమణారావు, జీవీ రమణ, బీవీ రమణలు కార్మికులకు పిలుపు నిచ్చారు. ఈ మేరకు ఆదివారం పట్టణంలోని సుందరయ్య భవనంలో మున్సిపల్ వర్కర్స్, ఎంప్లాయిస్ యూనియన్‌తో నిర్వహించిన సమావేశంలో వారు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మున్సిపల్ కార్మికుల సమస్యలు పరిష్కరించడంలో రాష్ట్ర ప్రభుత్వం నిర్లక్ష్యం వహిస్తోందన్నారు. కనీస వేతనాలు పెంచాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని కోరుతూ 17రోజులుగా సమ్మె చేస్తున్నప్పటికీ పట్టించుకోవడం లేదన్నారు. కార్మికుల పని గంటలు పెంచే ఆలోచనను రాష్ట్ర ప్రభుత్వం విరమించుకోవాలని, గత ప్రభుత్వం హయాంలో నియమించిన పారిశుధ్య కార్మికులను తొలగించే ఆలోచనను విరమించుకోవాలని కోరారు. ఈ సందర్భంగా యూనియన్ అధ్యక్ష, కార్యదర్శులుగా ఎస్.శంకరరావు, పి.వరదరాజులుతో పాటు మరో 13 మంది కమిటీ సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కార్యక్రమంలో మున్సిపల్ యూనియన్ నాయకులు, కార్మికులు పాల్గొన్నారు.

పూర్తిస్థాయి అధికారులను నియమించాలి

సీతంపేట: గిరిజన సంక్షేమ విధానాలు, చట్టాలు, పథకాలు అమలు జరిగి గిరిజనుల అభివృద్ధి చెందాలంటే రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న అన్ని ఐటీడీఏలకు పూర్తిస్థాయిలో అధికారులను నియమించాలని గిరిజన ఐక్యవేదిక రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బిడ్డిక తేజేశ్వరరావు ఆదివారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. రాహుల్‌కుమార్ రెడ్డి బదిలీ తర్వాత సీతంపేట ఐటీడీఏకు ఇంతవరకు రెగ్యులర్ పీఓను నియమించలేదన్నారు. దీంతో గిరిజన సంఘాలతో కో ఆర్డినేషన్ సమావేశాలు జరగడం లేదన్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి ఐటీడీఏకు రెగ్యులర్ పీఓలను నియమించాలని కోరారు.

హెల్మెట్ తప్పనిసరి

భామిని: ద్విచక్ర వాహనదారులందరూ తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని బత్తిలి ఎస్సై జి.అప్పారావు సూచించారు. మండలంలోని కాట్రగడ వద్ద ఆదివారం వాహన తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నిబంధనలు పాటించని వారిపై చర్యలు తప్పవన్నారు. తనిఖీల్లో పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

సామాజిక స్పృహతో వ్యవహరించాలి



మాట్లాడుతున్న డాక్టర్ రాజేంద్ర

రాజాం: నవ సమాజ నిర్మాణంలో విలేకరుల పాత్ర చాలా గొప్పదని, ప్రతీ పాత్రికేయుడు సామాజిక స్పృహతో బాధ్యతగా మెలగాలని రాజాం జీఎంఆర్ కేర్ ఎండీ డాక్టర్ డి.రాజేంద్ర అన్నారు. రాజాంలోని తృప్తి ఫంక్షన్ హాల్‌లో ఆదివారం జరిగిన రాజాం ప్రెస్‌క్లబ్ నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకార కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. రాజాం ప్రాంతానికి రాష్ట్రంలో మంచి పేరు, గుర్తింపు ఉందని, ఈ ఖ్యాతిని పత్రికల ద్వారా మరింతగా బయట సమాజానికి తెలియజేసి, ప్రతీ ఒక్క అంశాన్ని మంచి వైఖరితో గుర్తించి, బాధితులకు న్యాయం చేసేలా ఉండాలని కోరారు. అనంతరం పద్మశ్రీ యడ్ల గోపాలరావు సమాజంలో పత్రికల ఆవశ్యకత, విలేకరుల ప్రాధాన్యత వివరించారు. రాజాం పట్టణ సీఐ కె.అశోక్ కుమార్ విలేకరుల బాధ్యతను గుర్తు చేశారు. అనంతరం ప్రెస్ క్లబ్ అధ్యక్షులు పెంకి వెంకటరావును, కార్యదర్శి కరణం సురేష్‌కుమార్, ట్రెజరర్ గణేష్‌తో పాటు కార్యవర్గాన్ని సత్కరించి, మెమెంటోలు అందించారు. రాజాం సప్తగిరి టెక్నో టైప్ ఇనిస్టిట్యూట్ నిర్వాహకులు గుంటముక్కల సప్తగిరి, సీనియర్ విలేకరులు శర్మ, శశిభూషణరావు, నాగేంద్ర, కల్లేపల్లి శ్రీనివాసరావు, శేఖర్, సూర్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

క్రికెట్ టోర్నీ విజేత 'కొండవాడ'



విజేత జట్టుకు ట్రోఫీ అందజేస్తున్న సీఐ హరి

గుమ్మలక్ష్మీపురం: మండలంలోని కె.శివడ గ్రామంలో ఆదివారం జరిగిన క్రికెట్ టోర్నీ ఆఖరి పోరులో కొండవాడ(గుమ్మలక్ష్మీపురం మండలం) గ్రామ జట్టు విజేతగా నిలిచి ట్రోఫీని కైవసం చేసుకుంది. బారామణి(కురుపాం మండలం) గ్రామ జట్టుతో జరిగిన ఫైనల్ మ్యాచ్‌లో తొలుత టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్న కొండవాడ జట్టు నిర్దేశిత 10 ఓవర్లలో 5 వికెట్లు కోల్పోయి 90 పరుగులు చేసింది. అనంతరం 91 పరుగుల విజయలక్ష్యంతో బరిలోకి దిగిన బారామణి జట్టు 33 పరుగులు మాత్రమే చేసి ఆలౌట్ అయింది. ఆ తర్వాత జరిగిన బహుమతుల ప్రదానోత్సవానికి ముఖ్య అతిథిగా ఎల్విన్‌పేట సీఐ బి.హరి హాజరై విజేత, రన్నరప్ జట్లకు ట్రోఫీలు అందజేశారు.

చోరీ కేసుపై దర్యాప్తు ముమ్మరం

వంగర: మండలంలోని బాగెంపేట గ్రామంలో పసుమర్తి శంకరరావు ఇంట్లో ఇటీవల చోరీ జరిగింది. బాధితుడి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసును దర్యాప్తు చేస్తున్నారు. చీపురుపల్లి డీఎస్పీ ఎస్.రాఘవులు ఆదివారం బాగెంపేట వెళ్లి చోరీ జరిగిన ఇంటిని పరిశీలించారు. దర్యాప్తును వేగవంతం చేయాలని పోలీస్ సిబ్బందిని ఆదేశించారు. అనంతరం ఆయన గ్రామస్తులతో సమావేశమయ్యారు. ఎవరైనా అపరిచిత వ్యక్తులు అనుమానస్పదంగా తిరుగుతూ కనిపిస్తే పోలీసులకు సమాచారం ఇవ్వాలన్నారు. నిర్లక్ష్యం చేయకుండా విలువైన వస్తువులను జాగ్రత్తగా భద్రపరుచుకోవాలని, గ్రామంలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు.డీఎస్పీ వెంట రాజాం టౌన్ సీఐ కె.అశోక్‌కుమార్, ఎస్ఐ షేక్ శంకర్, పోలీస్ సిబ్బంది ఉన్నారు.

మూడు నెలలకే రహదారులు ఛిద్రం..



సీఎస్పీ రోడ్డులో వండువ దాటిన తర్వాత ఛిద్రమవుతున్న రోడ్డు

- పనుల్లో లోపించిన నాణ్యతా ప్రమాణాలు

వీరఘట్టం: కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత పల్లె పండగలో భాగంగా వేస్తున్న రహదారుల్లో నాణ్యతా ప్రమాణాలు వెక్కిరిస్తున్నాయి. రోడ్లు వేసిన మూడు నెలలకే తారు ఊడిపోతుండడంతో ఛిద్రమవుతున్నాయి. ఇటీవల సీఎస్పీ రోడ్డు నుంచి చిదిమి గ్రామం వరకు సుమారు 3 కిలోమీటర్ల మేర వరకు వేసిన రహదారిలో పలు చోట్ల తారు ఊడిపోతోంది. అలాగే వండువ జంక్షన్ నుంచి నవగాం వరకు వేసిన బీటీ రహదారిలో వండువ దాటిన తర్వాత రహదారి పెచ్చులూడి డొల్లతనం బయట పడుతోంది. వాస్తవానికి రోడ్డు వేసేటపుప్పుడు అధికారుల పర్యవేక్షణ లేకపోవడంతో కాంట్రాక్టర్లు వారి ఇష్టం వచ్చినట్లు పనులు చేశారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. రూ.కోట్లు ఖర్చు చేసి వేస్తున్న రహదారులు కాంట్రాక్టర్లను పెంచేందుకే తప్ప ప్రజలకు ఉపయోగం లేదని పలువురు అంటున్నారు. సంబంధిత అధికారులు స్పందించి ఛిద్రమతున్న ఈ రోడ్డు బాగు చేయాలని వాహనదారులు కోరుతున్నారు.



చిదిమి రోడ్డులో ఊడిపోతున్న తారు